క్లుప్తంగా

భక్తులకు అన్న సమారాధన

పెనమలూరు: తాడిగడప ఎస్‌టీబీఎల్ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామివారి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకుడు బాలమురళి కీర్తి ప్రధాన్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఆలయంలో శనివారం స్వామివారి తిరుకల్యాణం చేసిన సందర్భంగా ఆదివారం అన్నసమారాధన చేశారు. దాదాపు మూడు వేల మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం



పెనమలూరు: గోసాల వైకుంఠపురంలో అమ్మవారి ఆలయ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నేత, గ్రామ సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు ఆర్థిక సాయం అందించారు. ఆలయ కమిటీ తెలిపిన వివరాల ప్రకారం... వైకుంఠపురంలో నిర్మాణం చేస్తున్న ఆలయానికి సర్పంచ్ శ్రీనివాసరావు రూ.70 వేలు ఆర్థిక సాయం అందించారన్నారు. సర్పంచ్ చొరవతో ఎంబీఎంఆర్ సంస్థ మరో రూ.25 వేలు ఆర్థిక సాయం ఇచ్చిందన్నారు. అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఎటువంటి సాయమైన సర్పంచ్ అందిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఆకుల సుశీల, ఝాన్సీ, కృష్ణ పలువురు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు

పెనమలూరు: భర్త వేధింపులు తాళలేక భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆదివారం కేసు నమోదు చేశారు. పోరంకి చర్చి రోడ్డుకు చెందిన నారబోయిన స్వర్ణలత గత 14 సంవత్సరాల క్రితం నరేష్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త కూలీ పనులు చేస్తాడు. అయితే దురలవాట్లకు బానిసగా మారి భార్యను సొమ్ము కోసం వేధిస్తున్నాడు. అలాగే తరచూ కొడుతుండటంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు భర్త పై కేసు నమోదు చేశారు.

దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు



గన్నవరం రూరల్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు అవసరమని బీబీగూడెం కెరుస్సో చర్చి పాస్టర్ డాక్టర్ డేవిడ్ రాజ్ తెలిపారు. స్థానిక పంచాయతీ ఆఫీస్ రోడ్డులో ఆదివారం చర్చి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి గ్రామస్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. రోజూ మంచినీరు, ఆదివారం మజ్జిగ పంపిణీ కొనసాగిస్తామని నిర్వాహకులు సెబాస్టియన్ తెలియజేశారు.

వాకర్స్ ఆధ్వర్యంలో అల్పాహారం, రాగిజావ పంపిణీ

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం అల్పాహారం, రాగిజావ, మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పదిహేను రోజులుగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఇప్పటి వరకు నాలుగు వేల మందికి అల్పాహారం, మజ్జిగ, రాగిజావ అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి వీసం ప్రసాదరావు, కోశాధికారి గంపా సాంబశివరావు, ట్రాక్ ఇన్‌చార్జ్ షేక్ మున్వర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుబడుల సమర్పణ

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలైనుల్లో భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

దాడి, బెదిరింపులపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకునితో పాటు అతని తల్లిదండ్రులపై దాడి చేయడమే కాకుండా బెదిరింపులకు పాల్పడిన వారిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫ్రైజర్‌పేట చర్చి ప్రాంతానికి చెందిన సోముపాక శరత్‌చంద్ర(27) వెల్డింగ్ పనులు చేస్తుంటాడు. ఈ నెల 26వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో వైఎస్సార్ కాలనీ నుంచి తిరిగి వస్తున్న శరత్‌చంద్ర, అతని స్నేహితుడు కిరణ్‌లకు ఎర్రకట్ట రోడ్డులో కొలగాని అశోక్, దేవా మరి కొంత మంది ఎదురుపడ్డారు. కారణం లేకుండా ఇద్దరిపై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకుని అక్కడకు వచ్చిన శరత్ చంద్ర తల్లిదండ్రులపై కూడా దాడి చేశారు.

గ్రామాల్లో అభివృద్ధికి ప్రణాళిక



గోసాలలో కొత్తగా వేసిన తారు రోడ్డు



గోసాలలో నిర్మాణం చేసిన షాదీఖానా

- రూ.3.05 కోట్లతో పనులు
- నిధులు మంజూరు
- సమస్యల పరిష్కారానికి కృషి

పెనమలూరు: మండల పరిషత్ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలోనే కాకుండా ఈ ఏడాది కూడా నిధులు పెద్ద ఎత్తున కేటాయించటంతో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సూచనలతో అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేశారు. పెనమలూరు, చోడవరం, పెదపులిపాక, వణుకూరు, గోసాల, గంగూరు గ్రామాలున్నాయి. విజయవాడ నగర శివారులో గ్రామాలు ఉండటంతో స్థిర నివాసాలు పెద్ద సంఖ్యలో ఏర్పడుతున్నాయి. దీంతో అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. ఇందులో భాగంగా 2023–2024 ఆర్థిక సంవత్సరానికి మండల పరిధిలో గ్రామాలు అభివృద్ధి చేయటానికి రూ.3.05 కోట్లు నిధులు మంజూరు చేసి ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ నిధుల్లో జనరల్ ఫండ్స్ రూ.83 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.80 కోట్లు ఉన్నాయి. మహిళా శిశు సంక్షేమానికి అదనంగా రూ.42 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు మరమ్మతులు చేస్తారు. మంజూరు చేసిన నిధులతో దాదాపు వందకు పైగా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందులో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, స్త్రీ సంక్షేమానికి 15 శాతం, తాగునీరుకు, అభివృద్ధి పనులకు 35 శాతం, ఇతర అవసరాలకు మిగతా సొమ్ము ఖర్చు చేయనున్నారు.

గత ఏడాదిలో శరవేగంగా పనులు..

2022–2023 ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. మండల జనరల్ ఫండ్స్ రూ.2.83 కోట్లతో వివిధ గ్రామాల్లో 80 అభివృద్ధి పనులు చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.57 కోట్లతో 20 పనులు చేశారు. ప్రధానంగా గ్రామాల్లో తాగునీరు, డ్రెయినేజీలు, రహదారులు నిర్మించారు. సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, అంగన్‌వాడీ భవనాలకు మ్యాచింగ్ గ్రాంట్‌లు మంజూరు చేశారు.

ప్రజాప్రతినిధుల సహకారంతో

ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి పనులు శరవేగంగా చేపడతాము. ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశాం. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పర్యవేక్షణలో పనులు చేసి ప్రజాసమస్యలు పరిష్కరిస్తాం.

సునీతాశర్మ, ఎంపీడీఓ, పెనమలూరు

జీవనశైలిలో మార్పులతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ అశోక్ వాష్నికర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మంచి ఆహారం, మంచి జీవనశైలితోనే ఆరోగ్యంగా ఉంటామని ఆరోగ్య భారతి అఖిల భారత అధ్యక్షుడు డాక్టర్ అశోక్ వాష్నికర్ అన్నారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయం హైందవిలో ఆదివారం ఆరోగ్య భారతి క్షేత్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య వ్యక్తి, తద్వారా ఆరోగ్య గ్రామం తద్వారా ఆరోగ్య దేశం అనే సదాలోచనతో ఆరోగ్య భారతి పనిచేస్తోందన్నారు. మన ఇంటిలో ఉండే నిత్యావసర వస్తువులు, కూరగాయలతో మనం ఆరోగ్యంగా ఉండే విధానాన్ని వివరించారు. ఆరోగ్య భారతి అన్ని రాష్ట్రాల్లోనూ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులకు మహిళలకు ఆరోగ్యం, హెల్తీ లైఫ్ స్టైల్ కొరకు కార్యక్రమాలు నిర్వహిస్తుందని ప్రాథమిక చికిత్స, చైర్ యోగ, స్వస్థ గ్రామం వంటి 24 రకాలైన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ప్రముఖ యూరాలజిస్టు, పిన్నమనేని ఫౌండేషన్ అవార్డు గ్రహీత డాక్టర్ సురేష్ పాతంకర్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఆరోగ్య భారతి ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయాలని చెప్పారు. కార్యక్రమంలో విజయవాడ ఆరోగ్య భారతి అధ్యక్షురాలు డాక్టర్ సౌజన్య, ఆశ్రమం కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ రావు, ఆరోగ్య భారతి అఖిల భారత కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతానికి చెందిన వైద్యులు, ఆరోగ్య భారతి కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమాలను ప్రాంత కార్యవర్గ సభ్యులు శంకర్ నారాయణ, డాక్టర్ నారాయణ పర్యవేక్షించారు.

ఎన్టీఆర్‌తో నటించడం పూర్వజన్మ సుకృతం



సినీనటుడు గుండు సుదర్శన్‌ను సత్కరిస్తున్న హజరత్తయ్య గుప్తా, సుందరరావు తదితరులు

విజయవాడకల్చరల్: ఎన్టీఆర్‌తో కలసి నటించడం తన పూర్వజన్మసుకృతంగా భావిస్తునట్లు సినీనటుడు డాక్టర్ గుండు సుదర్శన్ అన్నారు. మానసా సాహిత్య సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సినీ నటుడు ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు జరిగాయి. గుండు సుదర్శన్‌కు ఎన్టీఆర్ విశిష్ట పురస్కారంతో పాటు వివిధ రంగాలకు చెందిన వారికి ఎన్టీఆర్ స్మారక పురస్కార కార్యక్రమం నిర్వహించారు. పురస్కారం అందుకున్న సుదర్శన్ మాట్లాడుతూ ఎన్టీఆర్‌తో కలసి శ్రీనాథ కవిసార్వభౌమ సినిమాలో నటించానని అదే తన తొలి చిత్రమని తరువాత ఎన్టీఆర్ సినిమాలనుంచి విరమించుకున్నారని తెలిపారు. దర్శకుడు బాపుగారి కృషితో సినిమా జీవితం ప్రారంభించానని తెలుగు సినిమా ప్రేక్షకులు ఆదరించినట్లు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ తెలుగు జాతి కీర్తి పతాకను జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన నటుడు రామారావు అని అభివర్ణించారు. మానసా సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు సీహెచ్‌వీఎస్ బ్రహ్మనందరావు, సినీ దర్శకుడు డాక్టర్ పీఎం సుందరరావు, విశ్రాంత అధ్యాపకురాలు ద్రోణాదుల లలిత కుమారి ప్రసంగించారు. వివిధ రంగాలకు చెందిన 15 మందికి ఎన్టీఆర్ స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు.

జైనులకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం



మాట్లాడుతున్న మనోజ్‌కొఠారి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో జైనులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ జైన్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి అన్నారు. చైర్మన్‌గా నియమితులైన మనోజ్‌కొఠారికి శ్రీ సంభవనాథ్ రాజేంద్ర సూరి జైన్ సూర్జీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని పూలబావివీధిలో ఉన్న రాజేంద్ర భవన్‌లో సత్కార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్‌కొఠారి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని జైనులను గుర్తించిన వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. జైనుల సమస్యలను పరిష్కరించేందుకు తాను వారిధిగా పని చేసి అండగా ఉంటానని తెలిపారు. రానున్న కాలంలో జైనులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. జైనులందరూ ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. పలువురు మత గురువులు ఆశీస్సులందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రముఖులు రాజు సోలంకి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ గౌతమ్‌రెడ్డి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజలు ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి చేయాలని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతమ్‌రెడ్డి సూచించారు. స్థానిక సత్యనారాయణపురం భగత్ సింగ్ రోడ్డులోని వైఎస్సార్ ట్రేడ్‌యూనియన్ కార్యాలయంలో ఆదివారం గరుడ కంటి, దంతవైద్యశాల ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైద్యశిబిరాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నారని చెప్పారు. తాము ఇప్పటికే స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 5 వేల ఐఓఎల్ ఆపరేషన్స్ చేయించామన్నారు. ప్రతీ ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు. గరుడ కంటి, దంత వైద్యశాల నిర్వాహకులు శ్రీహర్ష, ఇబ్రహీం మాట్లాడుతూ.. తమ వంతు బాధ్యతగా తాము ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం 300 మందికి కంటి వైద్యులు పరీక్షలు చేశారు.

పేకాట శిబిరంపై దాడి

కంకిపాడు: పేకాట శిబిరంపై కంకిపాడు పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు... మండలంలోని గొడవర్రు గ్రామంలోని పంట పొలాల్లో పేకాట శిబిరం నడుస్తున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతంపై దాడి చేశారు. దాడిలో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.28,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

అసోసియేషన్‌కు సభ్యులందరూ చేయూతనివ్వాలి



ఆటోనగర్(విజయవాడతూర్పు): ఓల్డ్ ఐరన్ డీలర్స్ ఆటోనగర్ అసోసియేషన్‌ను అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లేందుకు సభ్యులందరూ చేయూతనివ్వాలని అసోసియేషన్ నూతన అధ్యక్షుడు బత్తుల ప్రసాద్‌రెడ్డి కోరారు. ఓల్డ్ ఐరన్ డీలర్స్ అసోసియేషన్ కార్యాలయంలో 37వ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా నూతన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. 1988 సంవత్సరంలో యలమందారెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన అసోసియేషన్ దిన దినాభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఏడాది అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సభ్యులకు బీమా అంశంపై చర్చిస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. జీఎస్టీని తగ్గించేందుకు త్వరలో ఉన్నతాధికారులను కలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్ష, సలహాదారులు కోగంటి రాధాకృష్ణమూర్తి, ఎస్‌కే సలీం, కార్యదర్శి వి.నాగకుమార్, కోశాధికారి కె.నరసింహారావు పాల్గొన్నారు.

ఘనంగా సురవరం జయంతి

మధురానగర్(విజయవాడసెంట్రల్):అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం వజ్రోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు, అల్లూరి సాంస్కృతిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వరరాజు, డి.భాస్కరరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం సురవరం చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ప్రతాపరెడ్డి భౌతికంగా లేకున్నప్పటికీ ఆయన అందించిన సేవలు ప్రతీ ఒక్కరి మదిలో ఎన్నటికీ నిలిచే ఉంటాయని చెప్పారు.

200 మందికి వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యనిపుణుడు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్ సూచించారు. స్థానిక దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదంలో అన్ని అనారోగ్య సమస్యలకు మంచి చికిత్స ఉందన్నారు. ఆయుర్వేద వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ద్రవపదార్థాలను అధికంగా తీసుకోవాలని సూచించారు. ప్రముఖ హోమియోపతి వైద్యుడు డాక్టర్ కోన వీరబ్రహ్మం మాట్లాడుతూ.. ఇప్పుడు ఎక్కువ చలి వస్తుందని చలికి హోమియోపతిలో మంచి చికిత్స ఉందన్నారు. చలి వైరస్ వల్ల వస్తుందని చెమటలు పట్టిన చోట సక్రమంగా శుభ్రం చేసుకోకపోవటం వల్ల సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని

ఉయ్యూరు: మండలంలోని ఆకునూరు గ్రామంలో జరుగుతున్న గారపాటి బాబూరావు మెమోరియల్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) విజేతలకు ట్రోఫీ, బహుమతులు అందించారు. వేసవిలో యువతకు క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటుచేసి క్రీడాభివృద్ధికి కృషి చేసిన ఆకునూరు వైఎస్సార్ సీపీ నాయకులు, యువతను అభినందించారు. క్రీడలకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి గారపాటి నాని, నాయకులు మెరుగుమాల ఏసుబాబు, ఆరేపల్లి శ్రీనివాసరావు, రమావత్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



తెన్నేరు శాఖా గ్రంథాలయంలో యోగాసనాలు వేస్తున్న చిన్నారులు



కంకిపాడు శాఖా గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు

కంకిపాడు:యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని తెన్నేరు శాఖా గ్రంథాలయ అధికారి ఎస్.సునీత అన్నారు. వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా తెన్నేరు శాఖా గ్రంథాలయంలో యోగాసనాల పోటీలు ఆదివారం నిర్వహించారు. ఆరోగ్యాన్ని పరిరక్షించే అనేక ఆసనాలు విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం నాట్యం, పాటల పోటీలు నిర్వహించారు. సునీత మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి శిబిరాలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో ఆదివారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలను గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

తెలుగు పద్యాలపై అవగాహన



విద్యార్థులకు నీతి కథలు బోధిస్తున్న రాఘవ

ఉయ్యూరు: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఉయ్యూరు ఏసీ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు నీతి కథలు, తెలుగు పద్యాలపై శిక్షణ ఇచ్చారు. ఆచార్యులు రాఘవ, రిసోర్సు పర్సన్ కోటేశ్వరరావు ఆయా అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు.

గన్నవరం రూరల్: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలని ముస్తాబాద శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి అన్నారు. ఆదివారం సమ్మర్ క్యాంపులో స్థానిక గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం గ్రామ పెద్దలు శేషగిరిరావు, భాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. డ్రాయింగ్, కథలు చెప్పటం నేర్పించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉయ్యూరు జెడ్పీ స్కూల్లో పూర్వ విద్యార్థులు

ఉయ్యూరు: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో 2000–2001లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. విద్యార్థులంతా పాఠశాలకు చేరుకుని తాము చదివిన తరగతి గదుల్లో కూర్చొని సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అప్పట్లో తాము చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. చదవు చెప్పిన గురువులను సత్కరించారు. ఆట పాటలతో ఆనందంగా గడిపారు. నాడు-నేడు కింద పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనులు, మారిన విద్యా ప్రమాణాలు, ప్రగతిని స్వయంగా చూసి ప్రశంసించారు.

ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనం

ఉంగుటూరు: ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 2012–13 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. పదేళ్ల తరువాత తమ స్నేహితులను కలుసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ పలకరింపులు, కరచలనాలు, గురువులకు నమస్కారాలతో ఆ ప్రాంగణంలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సత్కరించారు. అప్పటి ప్రధానోపాధ్యాయురాలు బి.జి.మార్గరేట్ ప్రసంగించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, అశోక్, చంద్రశేఖర్, ఉపాధ్యాయిని శైలజ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఉంగుటూరు జెడ్పీ స్కూల్ 2012-13 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ముగిసిన గంగానమ్మ సంబరాలు



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులు

గుడ్లవల్లేరు: వడ్లమన్నాడులో 27 ఏళ్లకు ఒకసారి జరిగే గంగానమ్మ సంబరాలను గ్రామస్తులు నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి మొక్కుబడులను చెల్లించే కార్యక్రమంతో ఈ సంబరాలు ముగిశాయి. అమ్మవారిని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.